క్లుప్తంగా

ప్రహరీ పనులు పూర్తి చేయాలి



ఈద్గా ప్రహరీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: పట్టణంలోని ఈద్గా మైదానం ప్రహరీ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా పరిశీలించారు. ప్రహరీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రంజాన్ పండగ కంటే ముందే ప్రహరీ పనులను పూర్తి చేయాలన్నారు.

కోటకొండ ఆంజనేయుడి తిరునాల ప్రారంభం

పెద్దవడుగూరు: మండలంలోని కోటకొండ ఆంజనేయస్వామి దేవాలయం, పెద్దవడుగూరులోని పేట ఉమామహేశ్వరస్వామి దేవాలయం, చెన్నకేశవస్వామి ఆలయం, క్రిష్టిపాడు, మేడిమాకులపల్లి, లక్ష్మంపల్లి తదితర గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కోటకొండ ఆంజనేయస్వామి తిరునాల ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశం ఉండటంతో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

రేపటి నుంచి బాట సుంకులమ్మ తిరునాల

పుట్లూరు: మండలంలోని బాట సుంకులమ్మ ఆలయం వద్ద శుక్రవారం, శనివారం తిరునాల నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. తిరునాల సందర్భంగా ఆలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించి, ఆలయ ప్రాంగణాన్ని వేడుకలకు సిద్ధం చేసినట్లు సర్పంచ్ ఓబులేష్ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

శింగనమల: మండలంలోని కల్లుమడి గ్రామంలోని బస్టాండ్ వద్ద బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండయ్య చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండలు ఎక్కువ కావడంతో, ప్రజలకు దాహార్తిని తీర్చాలన్న ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగేంద్ర, నల్లప్ప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వెండి పళ్లెం బహూకరణ

గుంతకల్లు రూరల్: గుంతకల్లు పట్టణానికి చెందిన కురాకుల మారుతీ ప్రసాద్, గౌతమి దంపతులు బుధవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి 500 గ్రాముల వెండి పళ్లెం బహూకరించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం వారికి ప్రసాదం అందజేశారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని పూలకుంట గ్రామంలో బుధవారం ఘర్షణ జరిగి ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రామాంజనేయులు అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఇంటి ముందు నుంచి బైక్‌లో వెళ్తుండగా చిన్నపాటి విషయంపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. పరస్పరం రాళ్లతో దాడి చేసుకోవడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి సల్లాపురమ్మ ఉత్సవాలు



సల్లాపురమ్మ దేవత మూలవిరాట్

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లిలో కొలువైన సల్లాపురమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. ఈ నెల 23 నుంచి 26 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు, ప్రజలు ఏర్పాట్లు చేశారు. సల్లాపురమ్మ దేవత ఉత్సవాలు ఏటా ఉగాది పండుగ తర్వాత నాలుగు రోజుల గ్రామస్తులు నిర్వహించనున్నారు. గురువారం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు భక్తులు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చి, మొక్కులు తీర్చుకుంటారు. మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, రెండోరోజు శనివారం శివుడి జాతర (పార్వేట) నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి ఆణిముత్యాలు అనే ఉచిత నాటకాన్ని ప్రదర్శిస్తారు. మూడో రోజు సల్లాపురమ్మ జాతర (పార్వేట) ఉంటుంది. రాత్రికి సీతారామ చెక్క భజన గజ్జెల పూజ ఉంటుంది. నాలుగో రోజు సోమవారం ఆంజనేయస్వామి జాతర (పార్వేట) జరుగుతాయి.



తాడిపత్రి టౌన్: సుంకులమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు



గుత్తి: పంచాగ శ్రవణం చేస్తున్న అర్చకులు



గుంతకల్లుటౌన్: శ్రీవారికి ధాన్యం కొలుస్తున్న అర్చకులు



గార్లదిన్నె: పూజలందుకున్న కోటంక సుబ్రహ్మణ్యేశ్వరుడు

శోభకృత్‌కు స్వాగతం



పామిడి: అలంకరణలో లక్ష్మీ చెన్నకేశవస్వామి

- ఘనంగా ఉగాది సంబరాలు

గుంతకల్లుటౌన్: తెలుగు వారి తొలి పండుగ, తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే ఉగాది పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. శోభకృత్ నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. కొత్త ఏడాది శుభం కలగాలని ఇళ్లల్లో ప్రత్యేక పూజలు చేసుకున్నారు. తీపి, వగరు, చేదుల తదితర రుచులతో పచ్చడిని స్వీకరించారు. పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు, రైతులు స్వామికి ధాన్యాన్ని కొలిచి సమర్పించారు. ఈ ఏడాదంతా పంటలు సమృద్ధిగా పండి, వ్యాపారాలు బాగా జరగాలని పూజలు చేశారు. అనంతరం శ్రీవారికి మాత్రాన్న సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రంగయ్య, కార్యదర్శి నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సుదర్శన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లో బుధవారం ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో పంచాగ శ్రవణం నిర్వహించారు. వేద పండితులు వాసుదేవ శర్మతో పాటు పలువురు వేద పండితులు పంచాగ శ్రవణం చేశారు. పట్టణంలోని కోట వీధిలో వెలిసిన లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో బుధవారం తెల్లవారు జామున తొలి సూర్య కిరణాలు స్వామి పాదాలను తాకాయి. ఈ దృశ్యాన్ని వీక్షించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సూర్య కిరణాలు స్వామి వారి పాదాలను తాకుతున్న దృశ్యాలను చూసి భక్తులు పులకించిపోయారు. ఆలయం నరసింహ స్వామి నామస్మరణతో మార్మోగింది.

గ్రామాల్లో ఉగాది సేద్యం

గుత్తి రూరల్: అనగానదొడ్డి, గొందిపల్లి, తురకపల్లి, కరిడికొండ, తొండపాడు, అబ్బేదొడ్డి, బేతాపల్లి, కొత్తపేట, వన్నేదొడ్డి, మాముదూరు, బసినేపల్లి, లచ్చానపల్లితో పాటు ఇతర గ్రామాల్లో బుధవారం రైతులు ఉగాది సేద్యం చేశారు. బుధవారం వేకువ జామున రైతులు తమ పిల్లలకు నూతన వస్త్రాలను ధరింపజేసి పొలాలకు తీసుకెళ్లారు. పొలాల్లో గొర్రు, నాగలికి పసుపు కుంకుమ పూసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వృషభాలకు ప్రత్యేకంగా అలంకరించి చిన్నారుల చేతుల మీదుగా సేద్యం పనులను ప్రారంభించారు. అనంతరం పొలాల్లో రైతులు గుంటక సాగుదోలారు. ఎద్దలకు ప్రత్యేక పూజలు చేసి ఈ యేడాది పంటలు సుభిక్షంగా పండాలని గుంటకతో పొలం దున్నారు. తొలకరి చినుకులు కురిసిన అనంతరం ఉగాది రోజు గుంటకతో పొలం దున్ని సంప్రదాయ, ఆచారాలను నిర్వహిస్తూ కల్మషం లేని చిన్నారులతో సేద్యం పనులను ప్రారంభిస్తే పంటలు బాగా పండుతాయని నమ్మకం.

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు, మాముదూరు, కొత్తపేట, ఎంగిలిబండ, బసినేపల్లి, బాచుపల్లి, వన్నేదొడ్డి, ఇసురాళ్లపల్లి గ్రామాల్లో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు కళ్లాపి చల్లి ఇంటి ముంగిట మామిడి తోరణాలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడి చేసి దేవుళ్లకు నైవేద్యం సమర్పించారు. గ్రామాల్లో యువకులు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్: శోభకృత్ నామ సంవత్సరం ప్రజలందరికీ విజయాలు చేకూర్చాలని, ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.రామలింగప్ప ఆకాంక్షించారు. బుధవారం నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ముద్రించిన నూతన తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర ఉత్సవ సమితి అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి, కార్యదర్శి సోమనాథ్, కోశాధికారి ఇల్లూరు లక్ష్మీనారాయణ, సభ్యులు గోపాజగదీష్, హరిహరనాథ్, రాజారమణ, మురళీ, వైఎస్సార్‌సీపీ సచివాలయాల పట్టణ కన్వీనర్ జింకల రామాంజినేయులు, డీపీఎస్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: పట్టణంలో బుధవారం ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇంటిల్లాది పాలు ఉదయయే తలంటు స్నానాలు ఆచరించి, కొత్త బట్టలు ధరించి ఇళ్ల ద్వారాలకు మామిడి తోరణాలు కట్టి, పూజలు చేశారు. పట్టణంలోని చింతల వెంకటరమణ స్వామి, బుగ్గ రామలింగేశ్వరస్వామి, సాయిబాబా, సంజీవనగర్‌లోని గాయత్రీ దేవి ఆలయం, సుంకులమ్మ పాలెంలోని సంకులమ్మ ఆలయం, కృష్ణాపురం జీరో రోడ్డులోని గంగమ్మ, తూర్పుపాలెంలోని పెద్దమ్మతల్లి, గంగమ్మతల్లి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. బుగ్గ రామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

యల్లనూరు: మండల వ్యాప్తంగా ఉగాది పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. తీపి, పులుపు, కారం, చేదు తదితర రుచులతో పచ్చడిని స్వీకరించారు. యల్లనూరు, కొడవండ్లపల్లి, చిలమకూరు తదితర గ్రామాల్లో వెలసిన పెద్దమ్మ, యల్లమ్మ అమ్మవారికి జాతర కార్యక్రమాలు పెద్ద ఎత్తున జనాలు జంతుబలులు చేస్తారు. పల్లెల్లో ఎటు చూసినా ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా బుధవారం ఉగాది సందడి నెలకొంది. ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడిని ఇంటిల్లిపాది సేవించారు. అలాగే గ్రామాల్లో యువత గ్రామీణ క్రీడలైన టెంకాయ విసురు పందెం, రాతి గుండు ఎత్తే పోటీలు, కబడ్డీ పోటీల్లో నిర్వహించారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

పామిడి: ఉగాది సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రమైన భోగేశ్వరాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, మహాయోగ దత్తపీఠం, అంకాలమ్మ, కుంటిమ్మ ఆలయం, తగ్గదేవాలయం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో అర్చకుల వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఈ నూతన సంవత్సరాది ప్రజలందరికీ ఆయురారోగ్య మహదైశ్వర్యాలను అనుగ్రహించాలని భక్తాదులు దేవుళ్లను కోరుకున్నారు. అర్చకులు పంచాంగం వినిపించారు.

పుట్లూరు: మండల వ్యాప్తంగా బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎల్లుట్లలో చెన్నకేశవస్వామి ఊరేగింపు, చింతకుంటలో కాలభైరవస్వామి ఆలయంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు.

శింగనమల: స్థానిక దుర్గాంజినేయ స్వామి దేవాలయం, సలకంచెరువు, తరిమెల, కల్లుమడి, వెస్ట్ నరసాపురం, సీ.బండమీదపల్లి, పెరవలి, నాయనపల్లి క్రాస్, నాయనవారిపల్లి గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గుత్తి రూరల్: అనగానదొడ్డి వద్ద ఉగాది సేద్యం



శింగనమల: కొలువుదీరిన ఆంజనేయుడు



పుట్లూరు: బాలాపురంలో అలంకరణలో గంగమ్మ



యల్లనూరులో పూజలందుకున్న ఆంజనేయుడు



తాడిపత్రి టౌన్: రాజరాజేశ్వరీ దేవికి పూజలు

మాన్యం భూముల్లో దౌర్జన్యంగా సేద్యం



మాన్యం భూముల్లో పూజలు చేసిన గొందిపల్లి గ్రామస్తులు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో ఉన్న గొందిపల్లి ఆంజనేయ స్వామి మాన్యం భూముల విషయంలో బుధవారం వివాదం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. జక్కలచెరువు గ్రామంలోని గొందిపల్లి ఆంజనేయ స్వామి ఆలయానికి సంబంధించి మాన్యం భూములు గొందిపల్లి గ్రామ శివారులో ఉన్నాయి. 1810 సంవత్సరం నుంచి భూములను అర్చకులు సాగు చేసుకుంటూ జక్కలచెరువు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ధూప, దీప నైవేద్యాలు చేస్తున్నారు. అయితే కొందరు గొందిపల్లి గ్రామస్తులు బుధవారం ఉదయం భూములు గొందిపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి సంబంధించినవని దౌర్జన్యంగా సేద్యం పనులు చేశారు. మాన్యం భూముల విషయంపై అర్చకులు హైకోర్టులో పిటిషన్ వేశారు. భూముల విషయం విచారించాలని హైకోర్టు దేవాదాయ శాఖకు ఆదేశించింది. అయితే దేవాదాయ శాఖ నుంచి నివేదిక రాకముందే గొందిపల్లి గ్రామస్తులు మాన్యం భూముల్లో అక్రమంగా ప్రవేశించి సేద్యం పనులు చేశారని అర్చకుడు రవికుమార్ ఆరోపించారు. గొందిపల్లి గ్రామస్తులు తమ భూముల్లో దౌర్జన్యంగా ప్రవేశించడంపై అర్చకుడు రవికుమార్ సీఐ వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు.

25న రాతిదూలం లాగుడు పోటీలు

తాడిపత్రి టౌన్: స్థానిక కృష్ణాపురం జీరో రోడ్డులోని గంగమ్మ తల్లి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఆకుల రామాంజులరెడ్డి, ఆకుల కొండారెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 25వ తేదీన రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకుల పెద్దనాగిరెడ్డి ఆయన సోదరుడు 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిన్ననాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20.వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే కన్సొలేషన్ బహుమతి కింద రూ. 5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే ఎద్ల యజమానులు జతకు రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

26న పాతకల్లూరులో..

గార్లదిన్నె: మండల పరిధిలోని పాతకల్లూరులో ఉగాది, శ్రీరామ నవమి పండుగ పురస్కరించుకుని ఈనెల 26న రాతి గుండు ఎత్తే పోటీలు, ఇరుసు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాతి గుండు ఎత్తే పోటీల్లో గెలిచిన వారికి మొదటి బహుమతి రూ.4 వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతిగా రూ.1,000, అలాగే ఇరుసు ఎత్తే పందెంలో గెలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.6 వేలు, రెండవ బహుమతిగా రూ.3 వేలు అందజేయనున్నారు.

కమనీయం.. అప్పేచర్ల పెద్దమ్మ రథోత్సవం



పెద్దమ్మ తల్లిని రథంపై కొలువుదీర్చిన దృశ్యం

పెద్దవడుగూరు: అప్పేచర్ల గ్రామ ప్రజలు ఉగాది పండుగను సరికొత్తగా జరుపుకున్నారు. గత ఆరేళ్లుగా గ్రామంలో శాంతి భద్రతల దృష్ట్యా ఎలాంటి ఉత్సవాలు జరుపుకోలేదు. అయితే ఈ ఏడు ఎలాగైనా ప్రతి ఒక్కరూ ఇంటి ఇలవేల్పుగా పూజించే పెద్దమ్మతల్లికి ఉత్సవాలు నిర్వహించాలని గ్రామ పెద్దలు తీర్మానించుకున్నారు. అమ్మవారికి నూతన రథాన్ని తయారు చేయించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆలయ కమిటీ సభ్యులు రథోత్సవాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ముసలమ్మ తెప్పోత్సవం



బీకేఎస్ చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



తెప్పోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి ప్రక్కన చెరువు కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి తెప్పోత్సవాన్ని బుధవారం ముసలమ్మ తల్లి వంశస్థులు సూర్యనారాయణరెడ్డి, సుశీలాదేవి, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మ వారిని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం పల్లకీలో కొలువుదీర్చి, అనంతపురం తాడిపత్రి రహదారిపై ఊరేగించారు. ముసలమ్మ దేవాలయం ప్రక్కనే ఉన్న అనంత సాగర్ (బీకేఎస్ చెరువు)లో అమ్మవారి తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎంపీపీ సునీత, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, సర్పంచ్ పార్వతి హాజరయ్యారు.

కాలువకు నీరు వదలడం హర్షణీయం



సీఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

యాడికి: అధికారంలోకి వచ్చిన వెంటనే తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యాడికి కాలువకు తరుచుగా నీరు వదులుతుండటంతో భూగర్భ జలాలు పెరిగాయని వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. మండలంలోని చందన గ్రామ సమీపంలో ఉన్న యాడికి కాలువ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిరంగారెడ్డి, వెంకట రామిరెడ్డి, శివకేశవ రెడ్డి, జలదుర్గం రామాంజనేయులు ఆధ్వర్యంలో గ్రామ రైతులు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి గంగపూజ నిర్వహించారు. గతంలో 1,000 అడుగులు వేసినా బోరుబావుల్లో చుక్కనీరు పడలేదని, ప్రస్తుతం 400 అడుగుల్లోపే బోరుబావుల నుంచి నీరు వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రంగస్వామి, నారాయణ స్వామి, రామ్మోహన్, ఉదయ్, శ్రీనివాసులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోటలో బుధవారం ద్విచక్ర వాహనాన్ని ఓ లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. నార్పల మండలం నాయనపల్లి గ్రామానికి చెందిన కృష్ణం రాజు, ఆయన భార్య మంజుల వెంకటేశ్వరమ్మ, కుమారుడు వరుణ్ తేజ్ తాడిపత్రి వైపు ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. ముచ్చుకోటలోని బస్టాప్ మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స చేసి ఇంటికి పంపించారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



సమావేశమైన ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

గుత్తి: పట్టణంలోని నిజామి షాదీ ఖానాలో బుధవారం ముస్లిం మైనార్టీలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి మండల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవ సలహాదారులుగా అబూబకర్, మైనుద్దిన్, ఇస్మాయిల్, హుస్సేన్ పీరా, అన్వర్ సాహెబ్, ఉమ్మర్, వలిసాబ్, అబ్దుల్ హై,రఫీ వుద్దీన్, బషీర్, అధ్యక్షుడిగా సుంకం రఫీ, కార్యదర్శిగా అబ్దుల్ జిలాన్, ఉపాధ్యక్షుడిగా రియాజ్, జాయింట్ సెక్రెటరీగా దస్తగిరి, కోశాధికారిగా నజీర్ అహ్మద్‌తో పాటు మరో 29 మంది సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం రంజాన్ మాసంలో చేయాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

కుక్క దాడిలో బాలికకు గాయాలు

గుత్తి: పట్టణంలోని న్యూ సీపీఐ కాలనీలో నివాసం ఉంటున్న రమణాచారి, రమాదేవి దంపతుల కుమార్తె ఉమామహేశ్వరిని బుధవారం కుక్క కరిచింది. ఉమామహేశ్వరి స్థానికంగా ఓ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నది. ఉగాది కావడంతో పాఠశాలకు సెలవు ఇచ్చారు. ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో ఓ కుక్క ఆ చిన్నారిపై దాడి చేసి గాయపరిచింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల కాలంలో గుత్తి మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కుక్కల బెడద అధికమైంది. రోజూ ఏదో ఒక ప్రాంతంలో కుక్కల దాడిలో ప్రజలు గాయపడి ఆసుపత్రి పాలవుతున్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

యాడికి: స్థానిక కస్తుర్బా బాలికా విద్యాలయంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు, అలాగే 7, 8 తరగతులకు సంబంధించి మిగిలిన సీట్ల ప్రవేశాలకు ఈనెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి నిర్మల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి విరాళం

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని కసాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి బుధవారం గుంతకల్లు పట్టణానికి చెందిన శంకర్, పుష్పాంజలి దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి రూ.4 లక్షల చెక్‌ను ఆలయ వ్యవస్థాపకుడు పరశురాముడుకు అందజేశారు. వెండి ఉత్సవ విగ్రహాల ఏర్పాటు నిమిత్తం ఈ మొత్తాన్ని విరాళంగా అందజేసినట్లు దాతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు తలారి పరశురాముడు దాతలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి ప్రసాదం అందజేశారు.